# బలి

"ప్రభాకర్! చెప్పానుగా నా పరిస్థితి... తర్వాత నీ ఇష్టం..." అతని తుది నిర్ణయంకోసమే ఎదురుచూస్తున్నట్టు ప్రభాకర్ ముఖంలోకిచూస్తూ ఉండిపోయాడు మూర్తి.

ముప్ఫైఅయిదేళ్ళు దాటుతున్నా ఇంకా ఒంటరి జీవితాన్నే గడుపుతున్న ప్రభాకర్ తన నిర్ణయం ఎలా ఉంటే బాగుంటుందా అని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

అందుకు ముఖ్యకారణం మూర్తే.

మూర్తి ఆంతర్యం వేదన ప్రభాకర్ పూర్తిగా అవగాహన చేసుకో గలిగేడు. అందుకే ఎటూ తేల్చి చెప్పలేని స్థితిలో ఉండి పోవాల్సి వచ్చింది.

"మూర్తీ! నేను పెళ్ళంటూ చేసుకుంటే... నీ చెల్లినే తప్పకుండా వివాహం చేసుకుంటాను. ప్రామిస్! అయితే

నాకు కొంత వ్యవధి కావాలి! ఒక నిర్ణయానికి రాబోయే ముందు నేను మరోసారి ఆలోచించుకోవాలి!..." సూటిగా జవాబిచ్చాడు ప్రభాకర్.

"నీ హోదా... సిరిసంపదలు చూచి ఆశపడటం లేదు ప్రభాకర్! నాకు అవకాశం ఇమ్మని స్నేహితుడిగా అర్థిస్తున్నాను..." అర్ధోక్తిలో ఆగిపోయాడు మూర్తి.

"డోన్ట్ బి సిల్లీ! ఇన్నేళ్ళ మనస్నేహంలో ఇదేనా నువ్వు నన్ను అర్థం చేసుకుంది?..." అనేశాడు.

ప్రభాకర్ మాటల్లో కొండంత ఆశ కన్పించింది మూర్తికి. అందుకే మవునంగా ఉండిపోవాల్సి వచ్చింది.

* * * *

కాలేజీలో చదువుకునే రోజుల నుంచీ మూర్తీ ప్రభాకర్ స్నేహితులు!

తమాషా ఏమిటంటే... చదువు పూర్తి కాగానే ఇద్దరికీ ఒకేచోట ఉద్యోగం వచ్చింది!

అయితే... మూర్తి క్లార్కు హోదాలో ఉద్యోగం సంపాదించుకోగలిగితే... డైరెక్టుగా ఆఫీసరు పోస్టుకి సెలక్టయ్యాడు ప్రభాకర్.

పైగా... గత మూడేళ్ళుగా ఇద్దరూ ఒకే బ్రాంచిలో వర్కు చేయగలగటం మహా అదృష్టం!

చదువు... హోదా... ఆస్తి... ఇన్ని గొప్ప లక్షణా లున్న ప్రభాకర్‌లో అప్పటికీ ఇప్పటికీ మార్పేమీ కనిపించ లేదు మూర్తికి.

*　　*　　*　　*

"అన్నయ్యా! నేను పెళ్ళిచేసుకోనని నీకు లక్ష సార్లు చెప్పేను. అయినా... నువ్వు నా పెళ్ళి గురించే ఆలోచిస్తూ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నావ్! – పరిస్థితి తెలిసి కూడా నువ్విట్లా చేస్తున్నావంటే ... నాకు బాధగా ఉంది...." నిష్ఠూరంగా అంది లత.

"చూడమ్మా! – నీకు అన్నీ తెలుసు! అయినా... నీ సరదా... ఆనందం... సుఖం నా కళ్ళతో చూచి సంతో షిద్దామనే ఈ ప్రయత్నమంతా! నిన్నొక ఇంటిదాన్ని చెయ్యాలనే తాపత్రయం!! పైగా ప్రభాకర్ నాకు స్నేహి తుడే కాదు – అంతకు మించిన ఆత్మీయుడు. నిన్ను కంటికి రెప్పలా చూచుకుంటాడు. అతనిపట్ల నాకా నమ్మక ముంది..." ఇంకా ఏదో చెప్పబోయిన వాడల్లా ఆగిపోయాడు మూర్తి.

"ప్రభాకర్ నీ మిత్రుడేకావచ్చు!... అతను ఎంతటి ఆదర్శాలున్న వ్యక్తి అయినా.... చూస్తూ చూస్తూ అవిటి పిల్లను పెళ్ళిచేసుకునేటందుకు సాహసించలేడు. అసలు విష యాన్ని దాచిపెట్టి నువ్వు నా అంద చందాల గురించే

గొప్పగా చెప్పి ఉంటావ్' నీ మిత్రుడితో – కానీ.... తీరా నన్ను చూచేక.... అతని అభిప్రాయాలూ... ఆలోచనలు తలక్రిందులవుతయ్. అప్పుడు నువ్వూ, నేనూ విచారించి ప్రయోజనం ఉండదు..." లత కంఠం గాద్గదికమైంది.

"లతా! ఆవేశపడకు! లోకంలో అంద విహీనులకూ అనాకారులకు .. అవిటి వాళ్ళకూ పెళ్ళిళ్ళే కావటం లేదా? అయినా ప్రతి సారీ... 'కుంటిదాన్ని, కుంటిదాన్నీ' అనేసి ఎందుకు నిన్ను నువ్వు కించపరుచుకుని మాట్లాడతావ్! చదువూ సంస్కారం ఉన్నదానివి .. నామాట విను!! ఒక స్నేహితుడ్ని ఒప్పించ గలిగిన నేను... నీకు నచ్చచెప్పలేక పోవటం నా దురదృష్టం! నాకీ ఒక్క అవకాశం ఇవ్వు! ఇంతకు మించి నిన్నేమీ కోరను..."

మూర్తి అభ్యర్థనలో... ! అన్నగా తనపట్ల చూపుతున్న ప్రేమ... తనను ఎలాగైనా ఒక ఇంటిదాన్ని చెయ్యాలనే ప్రయత్నం... అంతకు మించిన ఆరాటం గ్రహించలేక పోలేదు లత.

కానీ.... తన బ్రతుకు అవహేళనకు అనాదరణకూ గురికాబడటం బొత్తిగా ఇష్టం లేకుండా ఉంది.

చదువు పూర్తి చేసుకొని పెద్ద ఉద్యోగం సంపాదించుకోవాలని ఉవ్విళ్ళూరింది. అందరి ఆడపిల్లల్లాగా తనూ ఎన్నో తీపి కలలు కన్నది. ఊహాల్లో విహరించింది.

కానీ... విధి వక్రించింది.

చివరికి కుంటి బ్రతుకైంది.

తన బాధని... ఆవేదనను... వెలితితో నిండిపోయిన ఆలోచననూ మరో మనిషితో చెప్పుకోలేని పరిస్థితుల్లోకి విసిరివేయబడ్డది. అందుకు అనుక్షణం కుమిలిపోక తప్పటం లేదు.

చీకటి జీవితాన్ని ఒంటరిగానే గడపాలనుకుంది. అటు ఉద్యోగం చేసేటందుకూ.... ఇటు వివాహం చేసుకుందుకూ ఇష్టపడలేదు.

తను అందగత్తే! ఎవ్వరూ కాదనలేరు.

కానీ... ఉద్యోగంకోసం బైటికెడితే.... అందరూ తనకేసి ప్రత్యేకమైన దృష్టితో చూస్తారు. రకరకాల కామెంట్సుకి గురి కావలసి వస్తుంది. అది తనకిష్టంలేదు.

పెళ్ళి చేసుకుంటే.... నిత్యమూ తన అవిటితనాన్ని చూస్తూ ఆ బాధ భరించలేక.... ఏక్షణాన అయినా భర్త మనసు మార్చుకుంటే... తనను చీటికి మాటికి దెప్పుతూ అవమానిస్తే... అమ్మో! అప్పుడు అతీతమైన బాధతో... అనాదరణకు గురి కావలసి వస్తుంది.

తనకు అన్నీ తెలుసు! ఆ కారణంగానే అసలు పెళ్ళే చేసుకోకూడదనే కఠినమైన నిర్ణయం తీసుకుంది.

పైగా... తనకోసమే అన్నయ్యా పెళ్ళికూడా చేసుకో కుండా ఉన్నాడు. అన్నయ్య త్యాగం తాను జీవితాంతం మరిచిపోలేదు.

కానీ... తన కారణంగా అన్నయ్యా మాత్రం ఎన్నా ళ్ళని వంటరి జీవితాన్ని•గడపగలడు? ఏనాటికైనా అన్నయ్య పెళ్ళిచేసుకుంటే... వదిన తనను సమ దృష్టితో ఆదరిస్తుందని నమ్మక మేమిటి? — వదిన మాటకి అన్నయ్యా ఎదురుచెప్ప లేకపోతే... వారిద్దరికీ తానొక సమస్య అవుతుంది.

అందుకే...: అన్నయ్యకి ఎక్కడ కోపమొస్తుందో అనే భయంతో... మనసులో ఇష్టమున్నా లేకపోయినా... అన్నయ్యా తృప్తికోసం ప్రభాకర్‌తో పెళ్ళిచూపులకి వప్పుకోక తప్పలేదు లత.

అదీ ఒక షరతు మీద!

ప్రభాకర్‌తో తాను ఒంటరిగా మాట్లాడాలి! అన్ని విషయాలూ వివరంగా చర్చించాలి!

అందుకు మూర్తి ఒప్పుకున్నాడు.

మూర్తి ఇంటిముందు కారు ఆగింది!

ఆగినకార్లోంచి ప్రభాకర్, మూర్తిదిగి ఇంట్లోకి నడిచారు.

ప్రభాకర్‌ని ముందుగదిలో కూర్చుండబెట్టి మూర్తి కిచన్లోకి వెళ్ళాడు.

లత తయారుచేసి రెడీగా ఉంచిన కాఫీని కప్పులో పోసికొచ్చి ప్రభాకర్ కి అందించాడు మూర్తి.

"మూర్తీ! నో ఫార్మాలటీస్ ..." అనేసాడు ప్రభాకర్.

నీ స్థాయికితగ్గ ఏర్పాట్లు నేనేమీ ప్రత్యేకించి చెయ్యలేదులే. సింపుల్ కాఫీ మాత్రమే! తీసుకో!..." ఎదురుగా ఉన్న పేముకుర్చీలో కూర్చుంటూ అన్నాడు మూర్తి.

కాఫీ తాగుతూనే గదంతా కలియచూస్తున్నాడు ప్రభాకర్.

మూలగా వీణ కన్పించింది.

"ఏమిటీ ... నీకు సంగీతంలో కూడా ప్రవేశం ఉందా?..." ఆశ్చర్యపోతూ అడిగాడు.

"యువార్ మిస్టేకన్!! లత చక్కగా పాడుతుంది. గొప్పగా వీణకూడా వాయిస్తుంది ..." నవ్వుతూ చెప్పేడు మూర్తి.

"ఐ సీ! ఐ లైక్ మ్యూజిక్ లైక్ ఎనిథింగ్..." అనేసి చేతిలో ఉన్న కప్పుసాసరూ టీపాయ్ మీదఉంచి సిగరెట్ వెలిగించాడు ప్రభాకర్.

"లత ముస్తాబవుతోంది. మరో అయిదు నిముషాల్లో వచ్చేస్తుంది! ... బై ది బై నువ్వు మేగజైన్సు చూస్తూ ఉండు. నేనీలోగా అట్లా బజారుదాకా వెళ్ళి వస్తాను ..."

అనేసి కూర్చున్న వాడల్లా ఏదో గుర్తొచ్చిన వాడల్లే టక్కున లేచి బయల్దేరేడు మూర్తి.

ప్రభాకర్ కి కూడా లతతో ఒంటరిగానే మాట్లాడాలని ఉంది. ఆ కారణంగానే మూర్తి బజారు వెళ్ళొస్తానూ అని చెప్పినప్పుడు వద్దని వారించలేదు.

టీపాయ్ మీదున్న ఫిలిమ్ మేగజైన్ తిరగేస్తున్నాడన్న మాటే గానీ... ప్రభాకర్ ఆలోచనలు మరెటో ఉన్నాయి.

క్షణం గడిచే కొద్దీ వంటరి తనం భయంకరంగా ఉన్నట్లనిపిస్తోంది.

లత ఇంకా రాదేం? ... త్వరగావస్తే బావుండు... అనిపించింది.

అన్యమనస్కంగా పేజీలు తిప్పుతున్న పుస్తకాన్ని పక్కనబెట్టి లోపలికి తల తిప్పిచూశాడు.

ప్రభాకర్ ఆలోచన దృష్టి కంటికి కన్పించని లత మీదే కేంద్రీకృతమైనాయి.

మరో సిగరెట్ వెలిగించాడు. ఆ వెలిగించటంలో అసహనం ద్యోతకమైంది.

వాచీ చూచుకున్నాడు. కూర్చున్న వాడల్లా లేవబోయాడు.

"టక్ ... టక్" మంటూ దూరంగా కర్ర చప్పుడు

విన్పించడంతో అచేతనంగా కుర్చీలో మళ్ళీ కూర్చుండి పోయాడు.

రానురానూ క్రచ్ శబ్దం దగ్గరవసాగింది. తదేకంగా అటే చూస్తూ ఉండిపోయాడు ప్రభాకర్.

ప్రభాకర్ కూర్చున్న గదిలోకొచ్చి ఆగిపోయిందా శబ్దం.

"మీ ... రు ..." నిర్ఘాంతపోతూ అడిగాడు.

"నా పేరు లత! మీ స్నేహితుడి చెల్లెల్ని..." రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ తనను తాను పరిచయం చేసుకుంది.

చందనపు బొమ్మలాంటి అమ్మాయి! అంతకు మించిన అందమైన అలంకరణ!! కానీ ... కుడిచేతిచంక క్రిందుగా నేలకు ఆని ఉన్న క్రచ్! –వాట్ ఎ పిటీ... అనుకున్నాడు.

"కూర్చోండి ..." ఎదురుగా ఉన్న కుర్చీ చూపిస్తూ అన్నాడు ప్రభాకర్.

'క్రచ్' పక్కన పెట్టి కుర్చీని రెండు చేతులతో పట్టుకుని కూర్చోబోయింది లత.

"కెన్ ఐ హెల్ప్ యూ?" ప్రభాకర్ మాటలలో సభ్యత ధ్వనించింది.

"నో...థ్యాంక్స్! ఇంట్లో అన్ని పన్లూ చెయ్యగలను. అలవాటయిపోయింది..." కూర్చుని లేని నవ్వు తెచ్చిపెట్టుకుంటూ అంది.

ప్రభాకర్ ఆలోచనలు పరిపరివిధాలుగా ఉన్నయ్.

"మీ బ్రదర్ నాకు అంతా చెప్పేడు..." తెప్పరిల్లు కుంటూ అనేశాడు ప్రభాకర్.

"ఒక్క నిజం మాత్రం చెప్పి ఉండడు. చెప్పి ఉంటే... మీరు ఇంతదూరం వచ్చి నన్ను చూచేటందుకు శ్రమతీసు కొని ఉండేవారు కాదేమో..." టక్కున అనేసింది.

"డోన్ట్‌వర్రీ..." అప్రయత్నంగా అన్నాడు.

"నా గురించి మీకు ... మీ గురించి నాకూ ఎన్నో విషయాలు అన్నయ్య చెప్పగా తెలుసుకున్నాం! కానీ... మన అభిప్రాయాలు ఉద్దేశాలు కేవలం' మరుగున ఉండటం మంచిది కాదనిపించింది..." ఇంకా ఏదో చెప్పబోయింది లత.

"మీ గురించి మీ బ్రదర్ చెప్పింది అక్షరాలా నిజం! యువార్ రియల్లీ బ్యూటిఫుల్ ! మోర్ హేన్డ్సమ్!!" అన కుండా ఉండలేకపోయాడు ప్రభాకర్.

"చంద్రుడిలో మచ్చలాగ... జీవితాంతం నాలో మరువ లేని అవిటితనమూ ఉంది..." బేలగాఅంది.

లతలో బలీయంగా చోటుచేసుకున్న ఇన్ఫీరియారిటీని గ్రహించాడు ప్రభాకర్.

"మీరు అద్భుతంగా పాడతారనీ ... చక్కగా వీణ కూడా వాయిస్తారనీ చెప్పేడు మూర్తి..." లత ఆలోచనని దైవర్ట చేయాలనే ఉద్దేశ్యంతో అన్నాడు ప్రభాకర్.

నిరుత్సాహంగా నవ్వింది లత.

ఆ నవ్వు పేలవంగా ఉన్నట్టనిపించింది ప్రభాకర్‌కి.

"మీరు గ్రాడ్యుయేటా?" సిగరెట్ వెలిగిస్తూ అడిగేడు.

అవునన్నట్లు తలూపి "ఎమ్మెస్సీ కంప్లీట్ చెయ్యలేక పోయాను ..." నిర్లిప్తంగా అంది.

వద్దనుకుంటున్నా ... లత ఆలోచన్లు గతంలోకే పరుగుపెట్టసాగాయి.

"పాటేదైనా పాడండి ఐ మీన్ మీకు అభ్యంతరం లేకపోతేనే ..." కాళ్ళూపుతూ సరదాగా అడిగేడు.

నా గురించి మీరు ఏవేవో ఊహించిఉంటారు. నన్ను చూచేక మీలో మీ రూహించని మార్పేదో తప్పక చోటు చేసుకొని ఉంటుంది. అంచేత ... మీ తృప్తికోసమైనా పాడకతప్పదు. అవునా?!"

లత మాటలు గుండెమీద రాళ్ళ కర్రతో కొట్టినట్లు అనిపించాయి ప్రభాకర్‌కి.

"అదేంలేదు. ఇంతటి అందాన్ని ప్రసాదించినందుకు ఆ భగవంతుడు... అటిటి తనాన్ని ఎందుకు ఇచ్చాడనే ఆలో చిస్తున్నాను. అంతే ఎటో చూస్తూ అన్నాడు.

"చూడండీ! ఒక్క విషయం ... కేవలం నా పరి స్థితికి జాలిపడి ... సానుభూతితో మాత్రం నన్ను పెళ్ళి చేసు

కునేటందుకు సిద్ధ పడకండి!... అది మన ఇద్దరికీ శ్రేయస్కరం కాదు. ఏమంటారు? ... సూటిగా అడిగింది.

"మీలాగా ఫ్రాంక్ గా మాట్లాడేవాళ్ళంటే నాకు చాలా ఇష్టం! ఐ లైక్ సచ్ పీపుల్ లై కెనీ థింగ్... లలిత కళ్ళలోకి చురుగ్గా చూస్తూ అందంగా జవాబిచ్చాడు.

"మీరు నా గురించి అన్నయ్య ద్వారా విన్నది వేరు—ఇప్పుడు మీకళ్ళతో చూస్తున్నది మరొకటి! ఇప్పుడు చెప్పండి! మీరు నన్ను పెళ్ళాడేందుకు వప్పుకోగలరా? నో!— నాకు తెలుసు ... ఏపురుషుడూ ... చూస్తూ చూస్తూ ఒక అవిటి పిల్లను పెళ్ళాడేందుకు సాహసించడు కదూ?— టెల్ మీ ద ట్రూత్ ..." వెర్రిగా అనేసింది లత.

"మీరు అనవసరంగా ఒక చిన్న విషయం గురించి ఎగ్జైట్ అవుతున్నారు. టేకిట్ ఈజీ!!—"

"అవునండీ ... నాకు తెలిసినంత వరకు ... నేను ఊహించగల్గినంత వరకు జీవితం వేరు— త్యాగం వేరు! నా పరిస్థితి పట్ల తాత్కాలికంగా మీరు నన్ను వివాహం చేసుకుందామని అనుకోవచ్చు కానీ... ఆ తర్వాత మీకే తెలియని అసంతృప్తి ఏదో మిమ్మల్ని ఆవలిస్తుంది... మిమ్మల్ని లాంగ తీసి మీ మనసు మారుస్తుంది. అప్పుడు మీ తొందర పాటుకి పశ్చాత్తాపపడితే ... నా బ్రతుకు దుర్భరమైపోతుంది..." అంటూ వాపోయింది లత కంటిలో నీరు తొణికిసలాడింది.

"మిమ్మల్ని మీరు తక్కువ చేసుకొని మాట్లాడకండి! — నిజానికి నేను జీవితాంతం బ్రహ్మచారిగానే ఉండిపోదామనుకున్నాను. అందుకే...మీగురించి మూర్తి నాతో ప్రస్తావించినప్పుడు ఎటూ తేల్చి చెప్పలేని సందిగ్ధావస్థలో ఉండిపోయాను — కానీ ... మిమ్మల్ని చూస్తుంటే... మీపట్ల నాలో తెలియని అభిమానం చోటుచేసుకుంటూంది. ఐవాంట్ టు మేరీయు!— ఐ లైక్ యు, లతా!! బిలీవ్ మి!!!! ఆవేశంగా అనేశాడు ప్రభాకర్.

ఆ మాటల్లో విశ్వాసాన్ని చూడగలిగింది లత.

అదిచాలదన్నట్లు... దగ్గరగావచ్చి తన చేతులను అతని చేతుల్లోకి తీసుకొని మృదువుగా కుదిపాడు. కళ్ళల్లోకిచూస్తూ మిమ్మల్నే వివాహంచేసుకుంటాను— మీలో ఉండే అసంతృప్తిని శాశ్వతంగా తరిమేస్తాను లతా! అన్నాడు ప్రభాకర్.

ప్రభాకర్ చొరవకు ... మంచితనానికి లిప్తపాటు నివ్వెరపోయింది.

"తొందరేమిలేదు. మరోసారి ఆలోచించుకునే మీరొక నిర్ణయానికి రండి! సెకండ్ థాట్స్ ఆర్ ఆల్వేస్ బెటర్ ... యధార్థాన్ని నిక్కచ్చిగా చెప్పింది మరోసారి.

వెనక్కి వెళ్ళి తన కుర్చీలో కూర్చుండిపోయిన ప్రభాకర్ "ఐ కెన్ అండర్ స్టాండ్ యు! బట్ ... నాకు అర్థంకి

కానిదల్లా ఒక్కటే ... మీకీ దురదృష్టం పుట్టుకలోనే వచ్చిందా ... విషయం తెలుసుకుందామనే అడుగుతున్నాను. మీ ఫీలింగ్స్‌ని హర్టుచెయ్యాలని మాత్రం కాదు..." సిగరెట్ వెలిగిస్తూ అడిగాడు.

"కుంటితనం నాకు భగవంతుడు పుట్టుకతో ఇచ్చిన వరం కాదండీ ... మనుష్యుల రాక్షస ప్రవృత్తివల్ల కలిగిన శాపం మాత్రమే ..." ముఖాన్ని రెండు చేతులతో కప్పుకొని భావురు మంది.

లత ముఖంలోకే ప్రశ్నార్థకంగా చూస్తూ ఉండి పోయాడు ప్రభాకర్.

ఉప్పెనలా వస్తున్న దుఃఖాన్ని దిగమ్రింగు కొనడానికి ప్రయత్నిస్తూ శూన్యంలోకి తదేకంగా నిలిచి పోయిన లత చూపు సంపూర్ణంగా గతాన్ని నెమరేసుకో నారంభించింది.

"భయంకరమైన అనుభవం పగ వారికి కూడా వద్దు. ఆ రోజు ..." నిశ్చలంగా ప్రభాకర్ ముఖంలోకి చూస్తూ గతాన్ని చెప్పనారంభించింది లత.

"ఆ రోజు ...

అంతర్ కళాశాల సాంస్కృతికోత్సవాలు యూనివర్సిటీలో మొదలైనాయి.

ఆనాటి కార్యక్రమానికి సుమారు వెయ్యి మంది యూనివర్సిటీ కళాశాల విద్యార్థులు దాదాపు అయిదు వంద

లకు పైగా ఇంజనీరింగు విద్యార్థులూ...ఎందరో విద్యార్థినులు హాజరైనారు.

నాకు చిన్నప్పటినుంచే సంగీతమంటే ఎంతో ఇష్టం!

బి. యస్సీ. చదువుతుండగా రెండు సంవత్సరాలు వరుసగా నేనే మా కాలేజీలో లలిత సంగీతంలో బహుమతులు గెలుచుకున్నాను. ఎమ్మెస్సీలో చేరిన ఫస్టు ఇయర్‌లో కూడా ఫస్టుప్రైజు సంగీతంలో నాకే వచ్చింది.

ఆ రోజు లత సంగీతపు పోటీలో పాల్గొనే విద్యార్థినీ విద్యార్థులలో నేనూ ఉన్నాను.

నేను మైక్ ముందుకు రాగానే ఆడిటోరియంలో నిశ్శబ్దం చోటుచేసుకుంది.

పాట పూర్తయింది!

చప్పట్లూ. హర్షధ్వానాల మధ్య నేను ఉప్పొంగే ఉత్సాహంతో స్టేజీ దిగాను.

నాతో పరిచయం ఉన్న వాళ్ళూ లేని వాళ్ళూ ఇంకా ఎందరో ఆటోగ్రాఫుల కోసం నన్ను చుట్టుముట్టారు. పొగడ్తలతో నన్ను ఆకాశాని కెత్తేశారు.

ఒక్కసారి అక్కడ చేరిన రెండువేల మందిలో అలజడి బయలు దేరింది.

ఆడ పిల్లలు మగపిల్లలూ ఏకమైపోయారు.

అవకాశవాదులు అక్కడే చేరిన గరల్ స్టూడెంట్సును చూచి వెకిలి వేషాలు వేయటం... అల్లరి పెట్టడం... గేలి చేయటం మొదలు పెట్టారు.

అందరిని తప్పుకుంటూ ముందుకెళ్ళే ప్రయత్నంలో ఉండిపోయాను. కానీ నా వల్ల కాలేదు.

ఆడిటోరియంలో గందరగోళం విలయతాండవం చేసింది.

విద్యార్థినులపై ఇంజనీరింగు స్టూడెంట్సు దాడి చేయడం చూచి సహించలేని యూనివర్సిటీ విద్యార్థులు జోక్యం చేసుకున్నారు.

ఇరు పక్షాల మధ్య ఘర్షణ మొదలయింది.!

మాటలు పెరిగాయి! చేతులు కలిశాయి!

పావు గంటలో ఆడిటోరియం యుద్ధ భూమిగా తయారయింది.

గొంతులతో పాటు చొక్కాలు చించుకున్నారు. అందరిని తప్పుకుంటూ ముందుకెళ్ళే ప్రయత్నంలో ఉండిపోయాను. కానీ నావల్ల కాలేదు.

మేము ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని... మానాన్న ప్రాణాన్ని కాపాడుకుందుకు వెర్రిగా చీకట్లో తలొక వైపూ పరుగెత్తాం.

విద్యార్థుల అఘాయిత్యానికి కిరాతక చర్యలకూ బలయ్యారు కొందరు.

పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకోవలసిన అవసరం ఏర్పడింది.

స్టూడెంట్స్ బారి నుండి తప్పుకోవాలని అగమ్యంగా పరుగెత్తుతున్న నేను కాలు జారిపడిపోయాను.

నేలమీద పడిపోయిన నన్ను ఎవ్వరూ పట్టించుకోలేదు. ఆ అవసరం వారికి లేకపోయింది!

నిర్దాక్షిణ్యంగా నన్ను దాటుకుంటూ తొక్కుకుంటూ వెళ్ళారు.

ఆ తొక్కిసలాటలో దోపిడీలో నా కాలు ఫ్రాక్చ రయింది. నా ప్రాణం విలవిల్లాడి పోయింది. రోదించాను. స్పృహకోల్పోయాను.

ఎప్పటికో నన్ను ఆస్పత్రికి మోసుకెళ్ళారు .

ఆపరేషన్ చేయాల్సివచ్చింది.

ఆంప్యూటేట్ చేసి నాకు కుడికాలు క్రింది భాగం రిమూవ్ చేశారు డాక్టర్లు.

తెలివి వచ్చాక విషయం తెలుసుకుని నేను గుండెల విసేలా ఏడ్చాను. ఇంకా ఎందుకు బతికి ఉన్నానా అనిపించింది. నా మీద నాకే అసహ్యం వేసింది.

యూనివర్శిటి మూసివేసిన కారణంగా నా చదువు సాగలేదు. ఆ తర్వాత... అవిటి బ్రతుకు ఈడుస్తూ చదువు కోవాలని అనిపించలేదు ...

జరిగినదంతా పూస గుచ్చినట్టు చెప్పిన లత కళ్ళొత్తుకుంది.

బరువుగా నిట్టూర్చాడు ప్రభాకర్.

తల్లి దండ్రులు తినో తినకో తమ పిల్లలు భవిష్యత్తుని మహోన్నతంగా ఊహించుకొని చదువులకోసం కాలేజీలకు పంపిస్తుంటే... బాధ్యతా రహితంగా విద్యార్థులు ప్రవర్తించినందువల్ల... ఆ నాడు అనర్థం జరిగింది. ఆ కారణంగా నా బ్రతుకు చీకటి మయమైపోయింది. నాలాగా మరెందరో బాధ పడ్డారు!!— ఆస్పత్రి నుంచీ నా ఈ అవిటి జీవితాన్ని చూచుకుంటూ... నాలో నేను నిత్యమూ కుమిలిపోతూ జీవచ్ఛవంలా బ్రతుకుతున్నాను. నా బలహీనత నన్ను అనుక్షణమూ మింగేస్తూంటుంది. చెప్పండి! — నా కళ్ళలోకి చూస్తూన్న నిజాన్ని దాచకుండా ఇప్పుడు చెప్పండి కెన్ యు మేరిమీ నా??—" జాలిగా అంది లత. ... ఇంకేమీ మాట్లాడదలచుకోని ప్రభాకర్ కూర్చున్న వాడల్లా లేచి లత కుర్చీ సమీపించాడు. ఆమె భుజాలను తన రెండు చేతులతో పొదివి పట్టుకుని నుదిటిమీద నులి వెచ్చటి పెదాలతో స్పృశించాడు.

లత కంటినుండి జాలువారిన కన్నీటి బిందువులు ఆమె ముందు నిల్చున్న ప్రభాకర్ పాదాలను తాకాయి.

[5-7-78 ఆంధ్రప్రభ వారపత్రిక నుండి]